# "బడులే లేని పల్లెటూళ్ళలో......"

ఎవరో తోడు వస్తారని, ఏదో మేలు చేస్తారని

ఎదురుచూసి మోసపోకుమా నిజం మరిచి నిదుర పోకుమా...

బడులే లేని పల్లెటూళ్ళలో.........

గీ పాట వింటె నాకెక్కడున్నా మా బడి యాదికత్తది. బల్లె జరిగిన సంగతులు యాదిక్తయి. పల్లెటూరు బల్లు యాదికత్తయి. నా సదువులు యాదికత్తనే ఉంటయి.

నేనూళ్ళెకు పోతె రోజుకొక్కపారన్న మా బడి దిక్కు పొయ్యత్త. నేను మా ఊరిబల్లె సదువుకునేటప్పుడు మొదటి గంటే కాకముందే బడికాడుండెటోన్ని. మా రాజిరెడ్డి సార్తోని క్యారమాడెటోన్ని. సారుమీద గెలిత్తె కొడ్తడేమోనని బయపడి ఇరవయేడు పయింట్ల దగ్గరచ్చి ఓడెటోన్ని. సోపతికాల్లతోని దుమ్ముదుమ్మెగిరెటోన్ని. అలెగ్జాండర్, పురుషోత్తముడు, చంద్రగుప్తుడు, చాణుక్యుడు గిట్ల ఒక్కొక్కలం ఒక్కొక్కటనుకొని యుద్ధం సేసెటోల్లం. అండ్ల నేను చాణుక్యున్ని. ఓపారి మా పుల్లన్న పురుషోత్తముడని, భూమానందంను అలెగ్జాండరని సెప్పి కొట్లాటవెట్టిచ్చిన. పుల్లన్న బండెత్తేత్తె భూమానందం వేలిరిగింది. నాకు పురుషోత్తముడు గెల్సుడే ఇష్టముండె.

మా బల్లె గప్పుడు తొమ్మిది తరగతులుండె. మూడర్రల బడే ఉండె. కొన్ని గుడిసెలుండె. మా రాంచెంద్రం సారు ఊల్లె చెందాలు వసూలు జేపిచ్చి మాతోని పనిజేపిచ్చి మూడర్రల సిమిటి గూనెల్ల గట్టిచ్చిండు. గా అర్రలు గట్టేటప్పుడు మేం సారు బళ్ళూనికరొక్క పని జేసినం. గిప్పుడు గా బడి కూలిపోతున్నా ఎవ్వలు పట్టించుకుంటలేరు. అటెనుక నాల్గర్రల గవిరిమెంటు బంగ్ల గట్టింద్రు.

మారాంచెంద్రం సారు కండ్లవడితె అందర్ని మంచిగ సదువుకొమ్మన్ని సెప్పెటోడు. ఇండ్లల్లకు పోయి గూడ సెకిన్ సేసెటోడు. అట్లాంటి సారిగ దొరుకడు. నేను మా బల్లె సదివెటప్పుడు కొన్ని గమ్మతు గమ్మతు పనులయినయి.

ఓపారి నేను బడికి పొయ్యెటాల్లకు మా తరుగతోడు రామయ్యను పదిరువైమంది పట్టి కొడుతంద్రు. అచ్చినోడల్ల అన్నోటేసుకుంట వోతంద్రు. అన్నెందుకు గొడుతంద్రో ఎవ్వలకు తెలువది.

నేనెందు కూకుండన్నని నేనోరొండేసిన. ఆడేడ్సుకుంట నన్నెందుకు కొడుతంద్రురో అని మొత్తుకున్నా గనెవ్వలిన్లే.

మా ఊరి కర్నప్పంతులు ఊరి సర్పంచుండె. అల్లు భాగున్నోల్లు. అయినె కొడుకు నాతరగతిల్నే వుండె. నాకు మంచి సోపతికాడు. అయినెకంటెక్కో నాకు మార్కులచ్చినా ఏమనుకపోవు. మేమైదో తరుగతిలుండంగ ఓసాలయినెకు అయినెకంటెక్కో మార్కులచ్చినయి. గాసాలోనికి నాకన్నెక్కో మార్కులత్తయా అని కిందవడి బొర్లవట్టిండయినె. మేమందరం నవ్వినం. ఇంటికి పొయ్యాల్ల బాపుతోన్జెప్పిండు. [74] ఆల్ల బాపు సార్ను పిల్సిండు. అయినెకు బయపడి పంతులు కొడుక్కు ఇంకిన్ని మార్కులేసిండు సారు.

ఎనిమిదో తరగతిలుండంగ మాకు సాంఘికం సెప్పుటానికో కోమటి సారుండె. గయినె సదువ మంచిగ సెప్పుతుండె. గయినే గేమ్సు సార్. ఏం తెమ్మన్నో కొసిరికొసరి తెచ్చెటోడు. మాకు క్యారెంబోర్డు పొడర్లేదు. గదిగావన్నని లొల్లివెట్టినం. సారు తెత్తనని ఎంతగావన్నన్నడు. మా దాంట్ల కిట్టరెడ్డని మారంకులోడుండె. ఆడు లేసి ఓ సవశేరంత తేలేవన్నడు. సారు బాగ కోపానికచ్చిండు. సవశేరేంది? అరుదకిలంటేంది? అని అటీటురకులాండిండు. గాడన్న దాంట్ల తప్పేదుందో మాకరుతం గాలే. ఈ తాపగట్లంటె కొడుతనని కిట్టరెడ్డిమీది కురికచ్చిండు.

“ఏంది సారేమొ బాగంటన్నరు? మా అమ్మ కొమటయినింటికి పొయ్యి సవశేరం నూనె కొనుక్కరమ్మంటె ఎన్నిసార్ల తేలేదు నేను. గట్లనే గిప్పుడన్నేంది?” అన్నమోలె సప్పుడు జేకున్నడు.

ఇంకోసారి ఆ సారే మారాజేశంను మనదే దేశంరా అన్నడు. పాకిస్తన్ అన్నడు రాజేశం. సారట్లనే నిల్సున్నడు. “నా సేతిల తుపాకంటిప్పుడు నిన్ను కాల్చిపడేత్తురా” అని తిట్టిండు.

రోజు పగటీలి ఇంటికచ్చి బువ్వదిని సూర్నేడలు పందిరిగుంజ దాటినయంటె బడాల్లయిందని పెయెటోన్ని. గదే నాకు గడియారమప్పుడు.

మేం బడయిపెయినంక సాయింత్రంల రోజు వాలిబాల్, సెమ్మద్గిది ఆడుకునెటోల్లం. ఆడుకుంటానికి కోర్టుంది, బాలుంది, నెట్టుంది, గాలి గొట్టుటానికి పంపుంది. కని దాంట్ల వాషర్ లేక అది పన్జెయ్యకపోవు. గేమ్సు సారుకు వాషర్ దెమ్మని చాన సార్ల చెప్పినం. కని అస్సలే తేలే. రోజుకొగలు కన్నాగురం పొయినా మా మాటెవ్వలు సెవినపెట్టలే. మేం రోజు బాల్ల గాలిగొట్టుటానికి సైకిల్ కంపినున్న దూదేకుల సాయెబింటికి పొయ్యేటోల్లం. రోజువోతె అయినె గులిగెటోడు. ఎట్లనో బుదురకిచ్చి కొన్నొద్దులు గాలికొట్టినం. అటెనుక సాయబది బందుజేసిండు. అయినె లేనపుడు అక్కడున్న పొల్లగానికి గారెలు, పల్లీలు లంచమిచ్చి పంపుకొట్టుకునెటోల్లం. గిద్దెలిసి గాసాయెబు

పొరన్ని కొట్టిండు. ఇగది బందయింది. వాషర్ లేక మా ఆట బందయింది. ఎట్లనన్న వాషరొచ్చేటట్లు సూడన్నని ఆలోసించినం. మాకిట్టరెడ్డో ఉపాయం జెప్పిండు. అందరం గల్సి పెద్దసారఠ్రముంగట కప్పతల్లాడుకుంట లొల్లిపెట్టాలనుకున్నం. ఓ కట్టెపుల్లకో కప్పను గట్టినం. గిలాసతోని దానిమీద నీల్లు పోసుకుంట పాటలు పాడినం.

కప్పతల్లి కప్పతల్లి కడుపునిండే
దొంతాల్ దొంతాల్ దొడ్డి నిండే
నాగండ్లకు పెయినోల్లు నవ్వుకుంటచ్చిరి
మోటలకు పెయినోల్లు మొత్తుకుంటచ్చిరి
గుంటుకులకు పెయినోల్లు గుద్దుకుంటచ్చిరి
వానచ్చర్రో
అనుకుంట కేకలు వెట్టినం.

అర్రలోపలికెల్లి సిర్రుబుర్రులాడుకుంటచ్చిండు పెద్దసారు.

"ఏందిర్ర ఏం గావాలె?" కోపంగన్నడు.

"మాకు వాలిబాల్ల్ గాలి గొట్టుటానికి పంపుల వాషర్ గావాలె. ఎన్నిమట్ల సెప్పినా గనింటలేకపోతిరి. కంపినోడేమొ రానిత్తలేడు. ఇగ మేమెట్లాడుకోవవాలె?" అన్నం.

"గిదానికే గింత లొల్లార" అని సింగులు సదురుకుంట లోపల్కురికి ఇరవై రూపాయల్దెచ్చి కింద వడేసిండు.

"మీకేం గావన్నో తెచ్చుకో పొండ్రి" అన్నడు.

"మాకు గిన్ని పైసలెందుకు సారు? మాకొక్క వాషర్ గావాలె. గదానికి పావులుంటదో, అర్దో! కన్నాగురం పొయ్యేసారుతోని తెప్పియ్యండ్రి" అన్నం.

సరెనని మమ్ములనెల్లగొట్టిండు పెద్దసారు.

తెల్లారెవారకు వాషర్ రానెవచ్చె

గది యాదికచ్చినప్పుడల్ల మాకు నవ్వత్తది. సోపతికాల్లం కల్సినపుడు "కప్పతల్లాడుతె వాషరత్తది. ఏదైన మెల్లంగ జెప్పుతె ఎవ్వలినరు. కొన్నిటికి గడెబిడ సెయ్యక తప్పది" అనుకుంటం.

గిదేం పెద్దసంగతి గాదు. గని పల్లెటూరు బల్లల్ల వసతులు బాగ తక్కువే. రేడియుండది, లాబుండుడు కట్టమే, సానూల్లల్ల గిప్పటికి గూడ అంతంత మాత్రంగనే ఉండుడు నాకు బాదనిపిత్తది.

★ ★ ★